క్లుప్తంగా

రేపు నగదు ప్రోత్సాహకాల పంపిణీ

కందుకూరు రూరల్: ఇంటర్, పదో తరగతి పరీక్షల్లో నియోజకవర్గ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన జగనన్న ఆణిముత్యాల నగదు ప్రోత్సాహకాల పంపిణీ కార్యక్రమాన్ని నేడు ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో నిర్వహించనున్నట్లు ఎంఈవో వెంకటేశ్వరనాయక్ తెలిపారు. ఉదయం 10 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమంలో కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీధరరెడ్డి పాల్గొంటారని, ఆయన చేతుల మీదుగా అందజేస్తారని తెలిపారు.

చలివేంద్రం ప్రారంభం


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న గుత్తి శ్రీధర్

కనిగిరి రూరల్: వేసవిలో ప్రజల దాహార్తీ తీర్చేందుకు చలివేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఇస్కాన్ కేంద్ర కమిటీ సభ్యుడు గుత్తి శ్రీధర్ అన్నారు. స్థానిక మహవీర్ హాస్పిటల్ ప్రాంగణంలో ఇస్కాన్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని బుధవారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ సుబ్బారెడ్డి, మదర్‌థెరిస్సా సేవా సమితి అధ్యక్ష, కార్యదర్శులు ఎస్ ఎస్ రసూల్, పి అరుణోధర్, సోమిశెట్టి శ్రీనివాసులు, పచ్చవ శేఖర్, వాగిచర్ల వెంకటేశ్వర్లు, డి.చెంచులు, ఎల్ఐసీ నారాయణ, బసిరెడ్డి పిచ్చిరెడ్డి, నారాయణరెడ్డి, సుబ్బారావు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌గా దేవకృపావరం

వెలిగండ్ల: వెలిగండ్ల ఐసీడీఎస్ గ్రేడ్–1 సూపర్‌వైజర్‌గా దేవ కృపావరం బాధ్యతలు చేపట్టారు. గతంలో పామూరు మండలం మోపాడు సెక్టారు సూపర్‌వైజర్‌గా పనిచేశారు. సాధారణ బదిలీల్లో భాగంలో దేవకృపావరంను వెలిగండ్లకు కేటాయించారు. ఈమె స్థానంలో ఇప్పటివరకు పనిచేస్తున్న ఎంవీఎస్ పార్వతి కనిగిరి ఐసీడీఎస్ ప్రాజెక్టుకు బదిలీపై వెళ్లారు.

ఎస్సైగా శివ నాగరాజు

హనుమంతునిపాడు: ఎస్సైగా పి.శివ నాగరాజు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఒంగోలు వీఆర్‌అండ్‌డీసీఆర్‌బి విధులు నిర్వహిస్తున్న ఆయన్ను జిల్లా పోలీసు అధికారులు హనుమంతునిపాడు పోలీసుస్టేషన్‌కు బదిలీ చేశారు. ఇక్కడ ఎస్సైగా పనిచేస్తున్న జి. క్రిష్ణపావని ఒంగోలు వీఆర్‌కు బదిలీ చేశారు.

అంకమ్మతల్లి ఆలయానికి విరాళం


విరాళం అందజేస్తున్న దృశ్యం

కందుకూరు: అంకమ్మతల్లి ఆలయ పునర్నిర్మానానికి భక్తులు తమ వంతు సహకారం అందిస్తూనే ఉన్నారు. బుధవారం గుడ్లూరు గ్రామానికి చెందిన వీరాంజనేయులు, విజయలక్ష్మి దంపతులు ఆలయ నిర్మాణానికి రూ.25,121ను ఆలయ కమిటీ సభ్యుడు వెంకట్‌రెడ్డికి అందజేశారు.

85 మందికి వైద్య పరీక్షలు

హనుమంతునిపాడు: ఇంటింటికీ ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవల కార్యక్రమంలో భాగంగా బుధవారం వాలిచర్లలో నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ సందీప్ 85 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. బీపీ, సుగర్, జలుబు, దగ్గు, జ్వరం, తదితర వ్యాధులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. దీర్ఘ కాలిక వ్యాధులతో బాధపడుతున్న వారి ఇళ్లకు వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ సందీప్, వైద్య సిబ్బంది, 104 వాహన వైద్య సిబ్బంది షేక్ మస్తాన్, డేవిడ్ పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ దాడులు

లింగసముద్రం: మండలంలోని పలు గ్రామాల్లో ఒంగోలు విద్యుత్‌శాఖ డీపీఈ ఈఈ టి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బుధవారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. కందుకూరు డివిజన్‌కు సంబంధించి పది మంది ఏఈలు, డీసీఈకి సంబంధించి ఇద్దరు డీఈఈలు, ఏఈలు, సిబ్బంది కలిసి 31 బృందాలుగా ఏర్పడి పలు గ్రామాల్లో 2,541 సర్వీసులను తనిఖీ చేశారు. అక్రమంగా విద్యుత్ వాడుతున్న 9 మందిపై కేసులు నమోదు చేసి సుమారు రూ.1,11,000 జరిమానా విధించారు. అదనపులోడు వినియోగించుకుంటున్న 64 సర్వీసులను గుర్తించి రూ.1,99,000 అపరాధ రుసుం విధించారు. వారి వెంట కందుకూరు డివిజన్ ఈఈ కె.వీరయ్య, కందుకూరు రూరల్ డీఈ ఈఈ ఆర్.విజయబాబు, లింగసముద్రం ఏఈ ఎస్‌కే ఫిరోజ్, సిబ్బంది పాల్గొన్నారు.

18న మర్రిపూడిలో ఉచిత వైద్య శిబిరం

మర్రిపూడి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 18వ తేదీన ఉడుముల హాస్పిటల్ సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆర్థోపెడిక్, గైనకాలజీ, జనరల్ సర్జరీ, జనరల్ వైద్యనిపుణులైన ఉడుముల అశోక్‌రెడ్డి, ఎస్‌వీ గీతికారెడ్డి, జీవన్‌రెడ్డి, ఎ.శ్రీనివాసులు, కే నీలాహారికలు వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేస్తామని నిర్వాహకులు తెలిపారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కార్డు, ఈహెచ్‌ఎస్, వర్కింగ్ జర్నలిస్ట్ హెల్త్ కార్డు ద్వారా ఉచిత వైద్య సేవలు అందిస్తామన్నారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

రక్తదానంతో ప్రాణదానం


కందుకూరులో రక్తగ్రూపు నిర్ధారణ పరీక్ష కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సబ్‌కలెక్టర్


కనిగిరిలో రక్తదాత ముత్యాల శ్రీనివాసులరెడ్డిని సన్మానిస్తున్న చైర్మన్ గఫార్

కనిగిరి రూరల్: రక్తదానం చేసిన వారు ప్రాణదాతలుగా నిలుస్తారని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. ప్రపంచ రక్త దాన దినోత్సవం సందర్భంగా రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో బ్లడ్ గ్రూపింగ్ కార్యక్రమం బుధవారం కనిగిరిలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ టి.అజయ్ కుమార్ మాట్లాడుతూ రక్తదానం చేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపు నిచ్చారు. ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేయడం వల్ల ఎంతో మేలు జరుగుతుందని వివరించారు. కనిగిరిలో త్వరలో ఐఆర్‌సీఎస్ బ్రాంచ్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. ప్రతి ఒక్కరు బ్లడ్ గ్రూపింగ్ చేయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో 54 సార్లు రక్తదానం చేసిన ముత్యాల శ్రీనివాస్‌రెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో సోమిశెట్టి శ్రీనివాసులు, ఇస్కాన్ కేంద్ర కమిటీ సభ్యుడు గుత్తి శ్రీధర్, బొగ్గరపు శ్రీనివాస్, తాళ్లూరు వెంకటేశ్వర్లు, పసుపులేటి అరుణోధర్, గోపాల్, ఎస్‌కే జాబీర్ తదితరలు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ రక్తదానం చేయాలి

కందుకూరు: అత్యవసర పరిస్థితుల్లో రక్తం అవసరమైన వారికి యువత ముందుకొచ్చి సకాలంలో రక్తదానం చేసి ప్రాణాలు కాపాడాలని సబ్‌కలెక్టర్ ఎస్ఎస్ శోభిక సూచించారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం స్థానిక పోస్టాఫీస్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన ఉచిత రక్తగ్రూపు నిర్ధారణ పరీక్ష కేంద్రాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. యువతకు రక్తదానంపై చైతన్యం రావాలని సూచించారు.

జగనన్న విద్యాకానుక పంపిణీ


పీసీపల్లిలో నగదు అందజేస్తున్న స్వర్ణ రమణయ్య దంపతులు

పీసీపల్లి: మండల పరిధిలోని ఎంపీపీఎస్ దివాకరపల్లి పాఠశాలలో బుధవారం విద్యార్థులకు జగనన్న విద్యాకానుక పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంఈఓ దాసు ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థికి ప్రభుత్వం మెరుగైన విద్యా సామగ్రిని అందజేయడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం పాఠశాలకు రూ.10 వేలను స్వర్ణ రమణయ్య, అరుణలు అందజేశారు. కార్యక్రమంలో పీసీపల్లి క్లస్టర్ ఆర్ శ్రీనివాసులు, జెడ్పీహెచ్ఎస్ క్లస్టర్ ప్రధానోపాధ్యాయులు, ఇర్లపాడు క్లస్టర్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వలేటివారిపాలెంలో...

వలేటివారిపాలెం: మండలంలోని అయ్యవారిపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు బుధవారం గ్రామ సర్పంచ్ డేగ వెంకటేశ్వర్లు చేతుల మీదుగా జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ చేశారు. పాఠశాల హెచ్ఎం శివపార్వతి, గ్రామ ఉపసర్పంచ్ కొండలరావు, విద్యాకమిటీ చైర్మన్ మాలకొండరాయుడు, తదితరులు పాల్గొన్నారు.

తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి రావాలి


మాట్లాడుతున్న డిప్యూటీ ప్రాజెక్టు అధికారి శివన్నారాయణ

కందుకూరు రూరల్: రైతులకు తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి వచ్చే విధంగా వ్యవసాయ సిబ్బంది పనిచేయాలని నెల్లూరు జిల్లా వనరుల కేంద్రం డిప్యూటీ ప్రాజెక్టు అధికారి శివనారాయణ అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వ్యవసాయ శాఖ సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. డీఆర్‌సీ వ్యవసాయ సహాయకురాలు మారుతీదేవి, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త కిరణ్‌కుమార్, వ్యవసాయ సహాయ సంచాలకులు అనసూయ, డీఆర్‌సీ వ్యవసాయాధికారి మధురిమ, కందుకూరు, ఉలవపాడు, గుడ్లూరు వీవీపాలెం, లింగసముద్రం వ్యవసాయాధికారులు రాము, తిరుమల జ్యోతి, రవికుమార్, హేమంత్ భరత్‌కుమార్, అబ్రహం లింకన్, అన్ని మండలాల ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

22వ విడత వలంటీర్ల ఎంపిక

వలేటివారిపాలెం: మండలంలోని 21 గ్రామ సచివాలయాలకు సంబంధించి 22వ విడత వలంటీర్లను ఎంపిక చేయనున్నట్లు ఎంపీడీవో షేక్ రఫీక్‌అహ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని నూకవరం పంచాయతీ సీ10 క్లస్టర్‌లో ఎస్సీ (జనరల్) ఒక వలంటీర్ పోస్టు, పోలినేనిపాలెం సీ6 క్లస్టర్‌లో బీసీ (జనరల్) ఒక పోస్టు, కలవల్ల సీ7 క్లస్టర్‌లో ఎస్సీ (జనరల్) ఒక వలంటీర్ పోస్టు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. దరఖాస్తు చేయదలిచిన వారు ఈ నెల 14 నుంచి 16వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. దరఖాస్తుదారులు గ్రామ వలంటీరుగా ఏ గ్రామంలో పనిచేయాలో ఆ గ్రామానికి చెందిన వారై ఉండాలని, 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని, 18 నుంచి 35 సంవత్సరాల్లోపు వయసు కలిగి ఉండాలని చెప్పారు. అర్హులైన వారికి ఈ నెల 19వ తేదీ ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎంపీడీవో కార్యాలయంలో ఇంటర్వ్యూలు ఉంటాయని తెలిపారు.

రాళ్లపాడు ప్రాజెక్టు రోడ్డుకి మరమ్మతులు


రోడ్డుకు మరమ్మతులు చేస్తున్న దృశ్యం

లింగసముద్రం: రాళ్లపాడు ప్రాజెక్టు రోడ్డు గుంతలమయంగా మారి అధ్వానంగా తయారవడంతో కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి సొంత నిధులతో మరమ్మతులు చేయించారు. నాలుగు రోజుల క్రితం రాళ్లపాడు గ్రామంలో ఓ వివాహానికి ఎమ్మెల్యే హాజరైన సందర్భంగా కందుకూరు నుంచి రాళ్లపాడు ప్రాజెక్టు రోడ్డు మీదుగా రాళ్లపాడు వెళ్లే రోడ్డు దుస్థితిని గమనించారు. వెంటనే రోడ్డుకు మరమ్మతులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. ఆ మేరకు రోడ్డుకు మరమ్మతులు చేయించారు. ప్రాజెక్టు రోడ్డుకి రెండువైపులా ఉన్న చిల్లచెట్లు, పిచ్చి మొక్కలను పొక్లెయిన్‌తో తొలగించారు. రోడ్డు పై ఏర్పడిన గుంతలకు తారు వేయించారు. దీంతో వాహనదారులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

లోగ్రేడ్ రకానికీ మంచి ధర ఇవ్వాలి

● టుబాకో బోర్డు రీజినల్ మేనేజర్ లక్ష్మణరావు


టంగుటూరులో వేలాన్ని పరిశీలిస్తున్న రీజినల్ మేనేజర్ లక్ష్మణరావు

టంగుటూరు: లోగ్రేడ్ రకం పొగాకుకు కూడా మంచి ధర అందించాని వ్యాపారులకు బోర్డు రీజియన్ రీజినల్ మేనేజర్ లక్ష్మణరావు సూచించారు. స్థానిక వేలం కేంద్రాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇతల వేలం కేంద్రాల మార్కెట్ స్థితిని వివరించారు. అనంతరం రైతులు, వ్యాపారులతో చర్చించారు. కాగా స్థానిక వేలం కేంద్రానికి పొందూరు గ్రామ 688 బేళ్లు తీసుకురాగా 655 కొనుగోలయ్యాయి. 33 పొగాకు బేళ్లను వ్యాపారులు తిరస్కరించారు. గరిష్ట ధర కేజీ రూ.240, కనిష్ట ధర రూ.160, సరాసరి రూ.212.39 ధర పలికింది. వేలంలో మొత్తం 28 మంది వ్యాపారులు పాల్గొన్నారని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

పంచాయతీ కార్యదర్శిగా షేక్ జరీనా

టంగుటూరు: మండలంలోని మల్లవరప్పాడు పంచాయతీ కార్యదర్శిగా షేక్ జరీనా బుధవారం బాధ్యతలు తీసుకున్నారు. జరీనా లింగసముద్రం మండలంలో పనిచేస్తూ బదిలీపై మల్లవరప్పాడు పంచాయతీ కార్యదర్శిగా వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన జరీనాని సచివాలయ సిబ్బంది, సచివాలయ కన్వీనర్ వడ్డె వోలు పద్మ, నాయకులు పాటిబండ్ల కమలాకర్, చల్లా కోటేశ్వరరావు, మొలకలపల్లి సీతారామయ్య, రాతికింద వెంకటేశ్వర్లు తదితరులు కలిసి అభినందనలు తెలిపారు.

108లో ప్రసవం

హనుమంతునిపాడు: మండల పరిధిలోని ఉసుల్లపల్లి గ్రామానికి చెందిన గంగరాజు భార్య బాలమ్మకు పురిటి నొప్పులు ఎక్కువగా రావడంతో 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. ఆమెను అంబులెన్స్‌లో ఎక్కించుకొని కనిగిరి తరలిస్తుండగా మార్గమధ్యంలో పురిటి నొప్పులు ఎక్కువ కావడంతో ఈఎంటీ జాషువా, పైలెట్ విద్యాసాగర్ సహకారంతో సిబ్బంది అంబులెన్సులోనే కాన్పు చేశారు. తల్లి బిడ్డ క్షేమంగా ఉన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు 108 సిబ్బందికి క తజ్ఞతలు తెలిపారు.

రీసర్వేతో భూ సమస్యలకు పరిష్కారం


రీ సర్వేను పరిశీలిస్తున్న అధికారులు

లింగసముద్రం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు–భూరక్ష పథకంలో భాగంగా జరుగుతున్న రీసర్వేతో భూ సమస్యలు పరిష్కారమవుతాయని తహసీల్దార్ టి.ప్రసాద్ తెలిపారు. మండలంలోని మాలకొండ్రాయునిపాలెం, అన్నెబోయినపల్లె గ్రామాల్లో జరుగుతున్న రీ సర్వేలో భాగంగా ప్రభుత్వ భూములను గుర్తించి హద్దురాళ్లు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. మండలంలోని తూనుగుంట, విశ్వనాథపురం, తూర్పురాజుపాలెం గ్రామాల్లో రీసర్వే పూర్తి కావస్తున్నట్లు తెలిపారు. రీసర్వేని బుధవారం తహసీల్దార్ పరిశీలించారు. రీసర్వేకు రైతులు సహకరించాలన్నారు. ఎవరికైనా భూ సమస్యలు ఉంటే వారి వద్ద ఉన్న ఆధారాలు చూపించి సమస్యను పరిష్కరించుకోవాలన్నారు. అత్యాధునిక టెక్నాలజీతో రోవర్ ద్వారా సర్వే చేసి భవిష్యత్తులో రైతులకు ఎటువంటి సమస్య లేకుండా హద్దురాళ్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

లారీని ఢీకొట్టిన కారు


లారీని ఢీకొట్టిన బొలెరో

ఉలవపాడు: ముందు వెళ్తూ మలుపు తిరగబోతున్న లారీని వెనుక నుంచి కారు ఢీకొనడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ప్రమాదం జాతీయ రహదారిపై రాజుపాలెం జంక్షన్ వద్ద బుధవారం జరిగింది. శింగరాయకొండలోని జీవీఆర్ ఫ్యాక్టరీకి చెందిన వాటర్ ట్యాంకర్ లారీ రాజుపాలెం జంక్షన్ వద్ద మలుపు తిరుగుతుండగా, కరేడు నుంచి తుమ్మలపెంట వెళ్తున్న బొలెరో ఢీకొట్టింది. బొలెరోలోని డ్రైవర్ కృష్ణప్రసాద్, పక్కన కూర్చుని ఉన్న చంద్రశేఖర్‌కు గాయాలయ్యాయి. వీరిని ప్రైవేటు వాహనంలో ఉలవపాడు సీహెచ్‌సీ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

702 పొగాకు బేళ్ల విక్రయం

కందుకూరు: కందుకూరులో నిర్వహించిన పొగాకు వేలంలో బుధవారం 702 బేళ్లను రైతులు విక్రయించారు. కందుకూరు–1వ కేంద్రంలో 758 బేళ్లు వేలానికి ఉంచగా, వాటిలో 702 బేళ్లు అమ్ముడుపోయాయి. కేజీ పొగాకు అత్యధిక ధర రూ.240 కాగా, అత్యల్ప ధర రూ.161 వచ్చింది. రెండో వేలం కేంద్రంలో గోడౌన్ నిండిపోవడంతో బుధవారం వేలం నిలిపివేశారు. గోడౌన్‌ను ఖాళీ చేసిన తర్వాత యథావిధిగా వేలం నిర్వహిస్తామని అధికారులు తెలిపారు.

కొండపిలో 673...

కొండపి: స్థానిక పొగాకు వేలం కేంద్రదానికి బుధవారం చినవెంకన్నపాలెం, వెన్నూరు గ్రామాల రైతులు 711 బేళ్లు తీసుకురాగా వ్యాపారులు 673 కొనుగోలు చేశారు. వివిధ కారణాలతో 22 బేళ్లను తిరస్కరించారు. పొగాకు అత్యధిక ధర కేజీ రూ.240, అత్యల్ప ధర రూ.155, సరాసరి ధర రూ.230.92 రైతులకు దక్కింది.

నీట్ ఫలితాల్లో పామూరు విద్యార్థిని సత్తా


నీరుకట్టు సౌజన్య

పామూరు: నీట్ యూజీ–2023 ఫలితాలు మంగళవారం వెలువడగా మండలకేంద్రమైన పామూరులోని కందుకూరురోడ్డుకు చెందిన నీరుకట్టు సౌజన్య 611 మార్కులతో ఆల్‌ఇండియా ర్యాంక్–22816 ర్యాంక్ సాధించింది.

న్యూరాలజీ డాక్టర్‌గా సేవ చేయాలన్నదే లక్ష్యం

ఆంధ్రా యూనివర్సిటీ, విశాఖపట్నం లేదా గుంటూరు మెడికల్ కళాశాలలో సీటు వస్తుందనుకుంటున్నా. న్యూరాలజీ డాక్టర్‌గా పేదలకు వైద్యసేవలు అందించాలన్నదే లక్ష్యం. కుటుంబసభ్యులు, ఉపాధ్యాయులు ఎంతో ప్రోత్సహించడం వల్లే మంచి ర్యాంకు సాధించగలిగాను.

ఈఎంటీ కుటుంబానికి అండగా 108 సిబ్బంది



టంగుటూరు: కందుకూరు మండలం బలిజపాలెం గ్రామానికి చెందిన మధుబాబు కొండపి మండలం 108 వాహనం ఈఎంటీగా పనిచేస్తూ కొంత కాలం క్రితం మరణించారు. ఆయన కుటుంబానికి తోటి ఉద్యోగులు అండగా నిలిచారు. మధుబాబు మరణించిన సమయంలో వారి కుటుంబానికి మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10 వేలు అందించారు. బుధవారం ఉమ్మడి ప్రకాశం జిల్లా 108 ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు దర్గా మస్తాన్, ఉద్యోగులు కలిసి రూ.1,25,000 నగదును మధుబాబు కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో 108 సిబ్బంది వేణు, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో 40 రకాల లేబొరేటరీ పరీక్షలు


జనన ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న వైద్యాధికారులు

లింగసముద్రం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 40 రకాల లేబొరేటరీ పరీక్షలు అందుబాటులో ఉన్నాయని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పీహెచ్‌సీ వైద్యాధికారి డా.రమేష్ తెలిపారు. మండలంలోని ప్రజలు పీహెచ్‌సీకి వచ్చిన వారిని పరీక్షించి సంబంధిత జబ్బులకు పరీక్షలు చేయడం జరుగుతుందన్నారు. బుధవారం సార్వత్రిక వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని పరిశీలించి ఏఎస్ఎంలు, ఆశాలకు సలహాలు, సూచనలు చేశారు. పీహెచ్‌సీలో 2016 మే నుంచి ఇప్పటి వరకు జారీ చేయాల్సిన జనన ధ్రువీకరణ పత్రాలను ఎంపీడీవో శేషబాబుతో కలిసి అందజేశారు. ఎవరికైనా జనన ధ్రువీకరణ పత్రాలు రాకుంటే ఎంపీడీవోని కలిసి పొందవచ్చన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో జి.శ్రీనివాసులు, ఏఎస్ఎంలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు


పామూరులో గ్రాడ్యుయేషన్ డే నిర్వహిస్తున్న సూపర్‌వైజర్


కనిగిరిలో ర్యాలీలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ పార్వతి

పామూరు: మండలంలోని బొట్లగూడూరు సెక్టార్ పరిదిలోని కొత్తపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం గ్రాడ్యుయేషన్‌డే సూపర్‌వైజర్ గోళ్ల పద్మజ అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా సూపర్‌వైజర్ మాట్లాడుతూ 3 నుంచి 6 ఏళ్ల పిల్లలను శారీరక, మానసిక, సాంఘిక అభివృద్ధి, బంగారు భవిష్యత్ కోసం అంగన్‌వాడీ కేంద్రంలో ఉంచాలన్నారు. పౌష్టిక విలువలతో కూడిన ఆహారం అంగన్‌వాడీ కేంద్రంలోనే సాధ్యమన్నారు. ఈసందర్భంగా విద్యార్థులకు ప్రీస్కూల్ సర్టిఫికెట్లు ఇచ్చి వారిని ప్రాథమిక పాఠశాలలో చేర్పించి గ్రాడ్యుయేషన్‌లో భాగంగా ప్రసంశాపత్రం అందజేశారు. ఉపసర్పంచ్ మమత, హెచ్ఈవో కోటేశ్వరరావు, హెచ్‌యం రవీంద్రబాబు, పద్మ, పిల్లల తల్లిదండ్రులు, పిల్లలు పాల్గొన్నారు.

పిల్లలను విధిగా అంగన్‌వాడీల్లో చేర్పించండి

కనిగిరి రూరల్: తల్లిదండ్రులు 3–6 వయసున్న పిల్లలను విధిగా అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పార్వతి అన్నారు. మండలంలోని చీర్లదిన్నె అంగన్‌వాడీ కేంద్రంలో జన భాగీదారి కార్యక్రమంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ పార్వతి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి వివరించారు. ఏఎస్ఎం నిర్మల, ఎంఎస్‌కే ఉషశ్రీ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో

గుడ్లూరు: ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభమైనందున ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ సకాలంలో పాఠశాలలకు చేరుకోవాలని ఎంఈవో ప్రసాదరావు ఆదేశించారు. స్థానిక ఎమ్మార్సీ భవనంలో ఉన్నత, ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దుతున్నందున ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధపెట్టి తల్లిదండ్రులతో మాట్లాడి పిల్లలు ప్రభుత్వ పాఠశాలల్లోనే చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలల్లో చేరిన ప్రతి విద్యార్థికి జగనన్న విద్యాకానుక కిట్లు అందజేయాలన్నారు. జగనన్న గోరుముద్ద కింద నాణ్యమైన భోజనం అందిస్తున్నందున విద్యార్థులందరూ పాఠశాలల్లోనే తినేలా చర్యలు తీసుకోవాలన్నారు.

వైభవంగా విగ్రహాల ప్రతిష్ఠ


కోదండరామస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు

గుడ్లూరు: స్థానిక మిట్టపాలెంలో నూతనంగా నిర్మించిన కోదండరామస్వామి ఆలయంలో సీతాలక్ష్మణ హనుమత్ సమేత కోదండ రామస్వామి నూతన విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. వేదపండితుల ఆధ్వర్యంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, యజ్ఞం నిర్వహించారు. విగ్రహాల ప్రతిష్ఠతో పాటు విమాన శిఖర ప్రతిష్ఠ కూడా చేశారు. అనంతరం సీతారాముల కల్యాణాన్ని వేద పండితుల మంత్రాల నడుమ వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై కల్యాణాన్ని తిలకించారు. తీర్థప్రసాదాల అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఏపీ ఈఏపీసెట్ ఫలితాల్లో ప్రతిభ


మున్నెల్లి రాఘవేంద్రరెడ్డి (650)


దరిశి యశ్వంత్ (1431)


చేజెర్ల చార్మేష్ (7834)


షేక్.ఆయేషా (11710)


రామగిరి సిద్దాబి (12235)

పామూరు: ఏపీ ఈఏపీసెట్ ఫలితాల్లో పామూరు మండల విద్యార్థులు మెరుగైన ఫలితాలతో సత్తా చాటారు. ర్యాంకులవారిగా మున్నెల్లి రాఘవేంద్రరెడ్డి (650) ర్యాంకు, దరిశి యశ్వంత్ (1431), చేజెర్ల చార్మేష్ (7834), షేక్.ఆయేషా (11710), రామగిరి సిద్దాబి (12235) ర్యాంకులు సాధించారు. కాగా మున్నెల్లి రాఘవేంద్రరెడ్డి ఆల్‌ఇండియా జేఈఈ మెయిన్స్‌లో 99.89 పర్సంటైల్‌తో ఆల్‌ఇండియాస్థాయిలో 1369వ ర్యాంకు సాధించాడు. విద్యార్థులను కదిరి బాబూ రంగారావు, వివిధ పాఠశాలల కరస్పాండెంట్‌లు అభినందించారు.